# హృదయవేదన

శ్రీమతి వడ్డి కృష్ణవేణి

అదిసాయంకాలము. కాలవదగ్గిర జనం గుంపులుగా వెడుతున్నారు. శవంకొట్టుకొని వచ్చిందని చెప్పుకుంటున్నారు. శవాన్ని గుర్తుపట్టి వెంకమ్మగారిదని తేల్చారు. "ఆమె మర్యాదస్తురాలని, అల్లుడి దూరాగతాలే ఆమె ప్రాణం తీశాయని" ఒకరు, "బ్రతికినన్నాళ్లు మహా బాధలు పడ్డదని" కొందరు, "భర్త బ్రతికున్నప్పుడు ఇద్దరూ అన్యోన్యంగా వుండేవారు. ఆయనతోనే పోయిందంతా" అని కొందరు, "అల్లుడు వచ్చాక తన్నేమో సుఖపెడ్తాడనుకుంది కాని, ఈవిధంగా తనప్రాణాలనే తీస్తాడనుకో లేదా యిల్లాల"ని, కొందరు, ఈవిధంగా చెప్పుకోవడమే కాని అసలుకారణం ఎవరూ చెప్పటం లేదు.

నాకు ఈదృశ్యం చూడ్డంతోటే, హృదయం బరువెక్కింది. వెంటనే కాళ్లీడ్చుకుంటూ ఇంటికి వెడుతున్నాను. ఇంతలో ఒక ముసలమ్మ ఎదురొస్తూ "ఏమిటి నాయనా! ఆగోల" అంది. "ఎవరో వెంకమ్మగారట, ఈప్రక్క సందులో ఇల్లట, ఆమెశవం కాలవలో తేలిందని, జనం గుంపులుగా వెడుతున్నారు" అన్నాను. ఆముసలమ్మ చాలా ఆదుర్దాగా "అంతపనీ అయిందీ! నేను అనుకుంటూనే వున్నా, బలవంతాన చస్తుందని" అని కన్నీరు కార్చటం మొదలెట్టింది. ఆమె ఎవరో ఎందుకట్లా కన్నీరు కారుస్తోందో నాకేమి అర్థం కాలేదు.

"ఏమిటీ! మీకు ఆమె ఏం కావాలి?" అన్నా. "ఆమె మహా ఇల్లాలు. ఆవిడ చరిత్ర వింటే ఎవరకయినా కన్నీరు వస్తుంది. ఆమెది అదో జాతకంలే నాయనా, నాకు ఆమె ఏమీ కాదు. మా అమ్మాయిగారింటి ప్రక్క ఇల్లేలే ఆవిడది. ఆమె ఇంటి సంగతులన్ని మాకు తెలుస్తూనే వుంటాయి" అంది. నేను అడిగాము. ఆమెచరిత్ర ఏమిటో చెప్పమని. ఆవిడ ఈవిధంగా మొదలెట్టింది.

"వెంకమ్మ, సుబ్బయ్య భార్యాభర్తలు. వారు చాలా అన్యోన్యంగా, ఆదర్శంగా నుండేవారు. వేసి వెయ్యకుండా ఆస్తి ఉంది. ఏలోటూ లేకుండా సంతోషంగా కాలం గడిపుతున్నారా దంపతులు; కాని

వీరికున్న బాధ ఒక్కటే, పిల్లలు లేరని! కొన్ని రోజుల తర్వాత వెంకమ్మగారికి గర్భం కలిగింది పుట్టబోయే పిల్లకు సుబ్బయ్య చంటి పిల్లలకు అవసరమైన వస్తువులు. ఉయ్యాల, మొదలయినవన్నీ కొని, పిల్ల నట్టింట్లో ఎప్పుడుతిరుగుతుందా అని ఎదురు చూస్తూ వుండేవాడు ఆడపిల్ల కలిగింది, ఆనాడు ఆయన, ఆనందానికి మేర లేదు. ఉత్సవం జరిపాడు. పిల్ల చిలకలా పెరిగింది. పెండ్లీడు వచ్చింది.

*　　*　　*

ఒకనాడు వెంకమ్మగారింట్లో చాలా మంది మూగారు. ఆయన హఠాత్తుగా జబ్బుచేసి చనిపోయారు. పాపం! ఆమె దుఃఖానికి అంతులేదు. దహనసంస్కారాలు జరిగాయి. చుట్టాలు పన్నెండో రోజు అయాక ఎవరిళ్లకు వాళ్లెళ్లారు. సంపాదించిన ఆస్థివుంది కదా! ఎల్లాగైతేనేం ఆమె జీవయాత్ర సాగిస్తోంది.

ఆమెకున్నదల్లా ఒకటే దిగులు. పిల్ల పెళ్లివిషయం! చివరికి ఎలాగైతేనేం, ఒక అయ్యచేతిలో పెట్టి, ఇల్లరికం తెచ్చుకుంది. ఆనందంగానే గడిచి పోతూవుండేది. కాని విధి ఎల్లప్పుడూ ఒకేలాగే చూడదుకదా! ఆ ఆనందానికికూడా అంతరాయం కలిగే రోజులొచ్చాయి. ఆమె కష్టాలుకూడ మొదలయినాయి.

అల్లుడు చెడ సావాసాలు మరిగాడు. పేకాట, త్రాగుడు, మొదలయిన దురభ్యాసాలకు లోనై, ఇంట్లో అత్తగారికి చెప్పకుండా, వస్తువులు తిసుకుపోవడం, భార్యను పీడిపించి మెళ్లోనగలను తీసుకుపోయి అమ్మటం జరుగుతుండేది. ఒకరోజు అత్తగారు అల్లుణ్ణి మందలించింది. "ఆ అలవాట్లు మానమని" అత్తగారి మీదికి ఎదురు తిరిగాడు. భార్యను కొట్టటం, అదేమంటే, ఇంటికి రాననడం, ఈరకంగా కాలము గడుస్తున్నది. మధ్య మధ్య ఊళ్లో వాళ్లదగ్గర బాకీలు చేయడం, "అవి తీరిస్తేనే గాని ఇంటికి రాన"ని అత్తగార్ని బెదరించడం, ఆవిడ నిజంగానే రాడేమో అల్లుణ్ణి వెళ్ల కొట్టిందన్న పేరువస్తుందని, లోకానికి జడిసి అడిగినదంతా ఇస్తూవుండేది. ఇల్లా ఖర్చు చేస్తుంటే ఎంతడబ్బు నిలుస్తుంది. వున్న ఆస్తిలో మూడెకరాలు అమ్మాల్సి వచ్చింది. ఇంత డబ్బుఖర్చయినా, కూతురికేమన్నా సుఖమా అంటే అదీలేదు. ప్రతిరోజు తాగి వచ్చి భార్యను నానా బాధలు పెట్టేవాడు. ఎంతని భరించగలదు ఆతల్లి ప్రాణం!

"ఎందుకు నాయినా తప్పులేకుండా కొడ్తావు" అని అడిగితే, 'నాభార్య- నాయిష్టం' అనే సమాధానం! నానాతిప్పలు పెట్టేవాడు. అఖరుకు వున్న ఆస్తిని తనకు వ్రాసియిమ్మని ప్రతిరోజు యింట్లోగోల! ఇంట్లో అల్లుడు కాలుపెట్టిన దగ్గిరనుంచి. ఈరోజు వరకు సంతోషంగా ఒకరోజైనా కడుపునిండా తిండితిని ఎరుగదు. ఏనిమిషానికి ఏమౌ స్తుందో అనేభయమే. అత్తగార్ని కొట్టే దాకా వచ్చింది అల్లుడి వ్యవహారం. ఇన్ని అనుభవాలయిన తర్వాత గ్రహించింది వెంకమ్మగారు ఇల్లరికం అంటే ఏమిటాని? ఏదో కాలం గడుస్తున్నది కదా అంటే భగ వంతుడు ఆమెను ఇంకా పరీక్షిస్తున్నాడు కాబోలు. అల్లుడొచ్చి తనను సంతోష పెడ్తాడని, కొండంత ఆశతోవున్న వెంకమ్మ గారుఅల్లుడు ఇన్నికష్టాలు పెడ్తాడని కలలో కూడా అనుకోలేదు.

కానీ సంపాదన లేకపోయినా, వున్న దాంతోనయినా హాయిగా కాలం గడుపుకో వచ్చుకదా అంటే, అల్లుడి త్రాగుడుకు, జూదాలకు సరిపోతున్నది ఎంత డబ్బయినా! ఈ బాధ భరించలేక సు య్యో, గొయ్యో చూచుకుంటానంటూ వుండేది. తను లేక పోతే కూతురు దిక్కులేని దవుతుందని "ఈభర్తచేతులలో అది బ్రతక లేదని" విచా రిస్తుండేది. ఎంత ఓర్పువహించినా, రోజు రోజుకీ దురభ్యాసాలు ఎక్కువయి భరిం చటం కష్టముగా వుండేది. ఆవిడ ఎంత కాలం అని భరిస్తుంది, కాలవకు ప్రాణాలు అర్పించింది కాబోలు" అని ముసలమ్మ నిట్టూర్పు విడిచింది. నేను హృదయ వేద నతో ఇంటికి పోయాను. ఆరాత్రంతా నిద్రపట్టలేదు. వెంకమ్మగారి విషయమే స్ఫురణకు వచ్చేది చాలారోజులదాకా!

——(o)——

